పండుగపూట జరుగుతున్న పాఠాలు

పండుగపూటా పాఠాలు..!

◆ ఉగాదికీ సెలవివ్వని ప్రయివేటు కళాశాలలు
◆ యంత్రాల్లా విద్యార్థులతో చదువులు
◆ సమాచారమిచ్చినా స్పందించని విద్యాశాఖ

ప్రజాశక్తి-హిందూపురం

ప్రయివేటు విద్యాసంస్థలు పండుగ పూట కూడా విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా ప్రత్యేక తరగతుల పేరుతో వేధిస్తున్నారు. కళాశాలలకు పేరు రావాలని, విద్యార్థులను చదువుల యంత్రాలుగా మారుస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని నారాయణ కళాశాలలో తెలుగువారి ప్రధాన పండుగ ఉగాది రోజున కూడా బుధవారం సెలవివ్వకుండా తరగతులు నిర్వహించారు. ఈ విషయం ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులకు తెలిసినా వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

విద్యా సంవత్సరం ప్రారంభం అయినప్పటి నుంచి ఒక్క రోజు కూడా సెలవులు ఇవ్వకుండా కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులను చదువుల పేరుతో వేధిస్తున్నాయి. ప్రభుత్వం రెండవ శనివారం, ఆదివారంతో పాటు ప్రభుత్వ సెలవు రోజుల్లో కళాశాలలను నిర్వహించరాదని నిబంధన విధిస్తున్నా యాజమాన్యాలు వాటిని పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నిర్ణయించిన సమయాలను పక్కనపెట్టి సమయపాలన పాటించకుండా తరగతులను నిర్వహిస్తున్నారు. ఇలా విద్యార్థులను చదువుల పేరుతో మానసికంగా వేధిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి సమైక్య (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళనలు నిర్వహించారు. బుధవారం నాడు హిందూపురంలో నారాయణ కళాశాల వద్ద కూడా నిరసన తెలిపారు. ఈ విషయాన్ని ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులకు సైతం తెలియజేశారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కార్పొరేట్ విద్యాసంస్థలు ఇచ్చే ముడుపుల మత్తులో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి పండుగుల పూట కూడా సెలవులు ఇవ్వకుండా మార్కుల వేటలో విద్యార్థులను వేధిస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

విద్యార్థులను యంత్రాల్లా మార్చేస్తున్నారు..
బాబావలి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి. శ్రీ సత్యసాయి జిల్లా.

కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు వారి స్వార్థం కోసం విద్యార్థులను చదువుల యాంత్రాలుగా మారుస్తున్నారు. ప్రభుత్వ సెలవు రోజులతో పాటు పండుగపూట తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ విషయాలను అన్ని ఆధారాలతో సహా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఇలాగే సెలవు రోజుల్లో కూడా తరగతులను నిర్వహిస్తే సంబంధిత విద్యాసంస్థలపై ప్రత్యక్ష దాడులు నిర్వహిస్తాం.

టమోటాకు గ్రాఫ్టింగ్..!

◆ పది నెలల పంటకాలం ◆ సత్ఫలితాలిస్తున్న దిగుబడులు
◆ శ్రీకృష్ణదేవరాయ ఉద్యానవన కళాశాల అధ్యాపకుల ప్రయోగం

కాయగూరలకు గ్రాఫ్టటెడ్(అంటుగట్టం) పద్ధతి ఏమిటా అనుకుంటున్నారా... అవును మీరు విన్నది నిజమే... అనంతపురం రూరల్ పరిధిలోని ఆలమూరు వద్దనున్న శ్రీ కృష్ణదేవరాయ ఉద్యానవన కళాశాల అధ్యాపకులు కాయగూరల్లో టమోటాకు గ్రాఫ్టటెడ్ పద్ధతిలో సాగు చేస్తే ఎలాగుంటుందన్న ఆలోచన కలిగింది. తట్టిన ఆ ఆలోచనను ఆచరణలో పెట్టారు. ఇది ఒకింత సత్ఫలితాలను ఇచ్చే దిశగా ఉన్నట్టు అధ్యాపకులు చెబుతున్నారు.

టమోటాకు కట్టిన గ్రాఫ్టింగ్‌ను చూపుతున్న శాస్త్రవేత్త

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో ఉద్యానవన పంటల్లో టమోటసాగు విపరీతంగా పెరిగింది. అయితే ఇది ఒక సీజన్‌లోనే దిగుబడి వస్తోంది. వేసవి వచ్చే సమయానికి పంట రావడం లేదు. ఎండలకు తట్టుకునే రాల్లేకపోవడంతో ఈ సమయంలో పంట దిగుబడి కూడా లేక టమోట ధరలు సైతం వేసవిలో మండుతూ ఉంటాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీ కృష్ణదేవరాయ ఉద్యానవన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ జీవన్ బెట్టను తట్టుకునే రకాలైన సొలోనమ్ టోరమ్ రకం మొక్కకు సంబంధించిన వేరును, స్థానికంగా ఎక్కువగా పండించే టమోటా రకాన్ని ఒకదాన్ని ఎంచుకుని అంటుకట్టారు. దీన్ని గ్రీన్ హౌస్‌లో సాగు చేయడం ప్రారంభించారు. ఈ కలయికతో వచ్చిన మొక్క చాలా వరకు బెట్టను తట్టుకోవడమే కాకుండా, పంట దిగుబడి సాధారణంగా మూడు నుంచి నాలుగు మాసాల్లోపు పూర్తయ్యేది. పది మాసాల వరకు వస్తోందని జీవన్ తెలిపారు. అయితే ఇది ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని, మరింత విస్తృత పరచి రైతుల వరకు చేర్చి చూడటం ద్వారా పూర్తి స్థాయి సామర్థ్యం తెలుస్తుందని వివరించారు. ఇది పూర్తి స్థాయి విజయవంతం అయితే అనంతపురం జిల్లాలో రైతాంగానికి ఎంతగానో ఉపయోగ పడుతుందని భావిస్తున్నామన్నారు. ఎందుకంటే పంట కాలం పెరగడంతోపాటు దిగుబడి కూడా సాధారణ మొక్కకు ఐదు నుంచి ఆరు కిలోలు వస్తే దీనికి తొమ్మిది కిలోల వరకు కూడా దిగుబడి వచ్చే అవకాశముంది.

ఈ ప్రాంతావసరాలకు అనుగుణమైన రకాల కోసం ప్రయత్నిస్తున్నాం...

నారాయణరెడ్డి, కళాశాల అసిస్టెంట్ డీన్

అనంతపురం జిల్లా ఉద్యానవన పంటలకు పెట్టింది. పేరు అయితే ప్రకృతి కొంత, మరికొన్ని చోట్ల నేల స్వభావం కొంత ఆటంకాలుగా ఉంటున్నాయి. ఇటువంటి వాతావరణ పరిస్థితుల్లోనూ దిగుబడులు బాగా వచ్చి రైతులకు ప్రయోజనం చేకూరాలన్నది తమ అభిమతం. కళాశాల కేవలం విద్యను భోదించేందుకే కాకుండా ఈ ప్రాంత రైతాంగానికి మేలు చేసే విధంగా కొత్త ఆలోచనలు, ప్రయోగాలు తమ కళాశాల పరిధిలో చేస్తున్నాం. అందుకే కళాశాల సువిశాల వాతావరణంలోని దేశంలోని అన్ని రకాల మొక్కలను తీసుకొచ్చి పెంచడం జరుగుతోంది. కొత్తకొత్త రాకలుగా కూడా పెట్టియున్నాం. ఇందులో ఏ కొన్ని విజయవంతమైనా జిల్లా రైతాంగానికి ప్రయోజనం జరుగుతుందని ఆశిస్తున్నాం. ఆ దిశగా తమ సిబ్బంది, తాము పనిచేస్తున్నాం. ఇందులో భాగంగానే టమోటా గ్రాఫ్టింగ్ ప్రయోగం కూడా అని వివరించారు.

ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి విజయం జగన్‌కు చెంపపెట్టు

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి విజయం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి చెంప పెట్టులాంటిదని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఆయన రాయదుర్గం టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో కలిసి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంపై వ్యక్తమవుతున్న తీవ్రమైన వ్యతిరేకత, చంద్రబాబునాయుడి పాలన రాష్ట్రానికి అవసరమనే ప్రజల బలమైన కోరిక వల్లే పట్టభద్రుల ఎన్నికల్లో టిడిపి అఖండ విజయం సాధించిందన్నారు. పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ పరిధిలో ఉన్న 38 నియోజకవర్గాల్లో వైసీపీకి ఉన్న వ్యతిరేకత తాజా ఫలితంతో స్పష్టమైందన్నారు. జగన్ సొంత జిల్లా కడపలో కూడా వైసిపి ఘోరంగా ఓడిపోవడం టీడీపీకి శుభపరిణామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాకముందే ఓట్ల నమోదు కార్యక్రమం నుండి ప్రచారం వరకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేయడం వల్లే విజయం సాధ్యమైందన్నారు. ఇదే ఉత్సాహంతో 2024 సాధారణ ఎన్నికల్లో రాయదుర్గంతో పాటు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని గెలిపించడానికి ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తా కంకణబద్ధులు కావాలన్నారు. నిర్లక్ష్యం, అత్యుత్సాహం విడిచిపెట్టి రెట్టింపు కష్టంతో, ప్రతి కుటుంబాన్ని కలవడంతో పాటు మళ్లీ ఈ రాష్ట్రానికి చంద్రబాబు నాయుడి పాలన అవసరాన్ని తెలియజెప్పాలని కోరారు. రాయదుర్గంలో తెలుగుదేశం పాలనలో ప్రారంభించి, ఆగిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి ప్రజల మద్దతు పొందాలని పార్టీ నాయకులకు కాలవ సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నిక విజయంలో భాగస్వాములైన పార్టీ కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రాజు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్లు లాలెప్ప, హనుమంతు, గిరిమల్లప్ప, హనుమంత రెడ్డి, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి సంపత్ కుమారి, క్లస్టర్ ఇన్‌ఛార్జి, మోహన్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, జిల్లా వాణిజ్య అధ్యక్షుడు వెంకటేశులు, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు ఇనాయత్, సన్నన్న, నాగరాజు, ధానవేంద్ర, ఆనంద రాజు, తిప్పయ్య, వేణు, కరెన్న, నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

భయమెరుగని వీరులు

◆ భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల జీవితం స్ఫూర్తిదాయకం ◆ సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నివాళి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అన్యాయాన్ని ఎదురించి బ్రిటీష్ పరిపాలకులను ధైర్య సాహసాలతో ఎదురొడ్డి ప్రాణాలను సైతం లెక్క చేయని భయమెరుగని భారతీయులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల 92వ వర్ధంతి సభలను గురువారం నాడు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిర్వహించారు. సిపిఎం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. అనంతపురం సిపిఎం నగర 1వ కమిటీ ఆధ్వర్యంలో రూరల్ పరిధిలోని సిపిఎం కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశ స్వాతంత్రం కోసం చిన్న వయసులోనే ఉరి కంబాలను ముద్దాడిన వీరులు భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లన్నారు. ఎన్ని సంవత్సరాలు గడిచిన భారతీయుల మది నుంచి వారి పోరాట స్ఫూర్తి చెరిగిపోదన్నారు. ఇలాంటి పోరాట యోధులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రస్తుత పాలకులు భగత్‌సింగ్ లాంటి పోరాట యోధుల ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశం పెట్టుబడిదారుల చేతుల్లో బందీ అయిపోయిందని విమర్శించారు. దేశ సంపద కొంతమంది చేతుల్లో ఉందన్నారు. ఇలాంటి పాలకులకు ప్రజలకు బుద్ధిచెప్పాలన్నారు. ప్రజాతంత్ర వాదులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ ఆశయాలను కొనసాగించాలంటే ప్రభుత్వాలు పేదల జీవన ప్రమాణాలు పెంచే కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం కాలనీవాసులతో ప్రతిజ్ఞ చేయించారు. 'కార్పొరేట్ మతోన్మాద నిరంకుశ కోరల్లో నలిగిపోతున్న భారతదేశాన్ని విముక్తి చేయడానికి, సకల ప్రజానీకాన్ని సమీకరించి పోరాటాలు నిర్వహించడం ద్వారా మరో నూతన సమాజ నిర్మాణానికి కదిలి పని చేస్తామని, కార్మిక వర్గ నాయకత్వంలో సమ సమాజ నిర్మాణానికి పూనుకుంటామని, దేశం కోసం, ప్రజల కోసం సొంత ప్రయోజనాలను పక్కనపెట్టి నిస్వార్థంగా, నిజాయితీగా ప్రజల కోసం కషి చేస్తామని' ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, నగర నాయకులు ప్రకాష్, మసూద్, గపూర్, బాబా కాలనీవాసులు షరీఫ్, మోహన్, వలీ పాల్గొన్నారు.

అనంతపురంలో భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లకు నివాళులు అర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో

సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల వర్ధంతి కార్యక్రమాన్ని టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నగర కార్యదర్శి శ్రీనివాసులు, అధ్యక్షులు నాగరాజు సోమప్ప, నాగరాజు, విశ్వ, ముత్తుజ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో

భారత స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు వర్ధంతి కార్యక్రమాన్ని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో నిప్పు రవ్వల జ్వలించిన నిప్పు కణికలుగా భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్‌గురులు నిలిచారని తెలిపారు. వారి ఆశలను పోరాట స్ఫూర్తిని నేటి తరం యువకులు అందిపుచ్చుకుని సమాజంలో జరుగుతున్నటువంటి అన్యాయాలు, అక్రమాల పైన, ఉద్యోగ, ఉపాధి, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి సమరశీల పోరాటాలు నిర్వహించాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలకష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న మామిడి, చీని, నిమ్మ, దానిమ్మ, సపోటా పంటలకు నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ పంట చేతికొచ్చే సమయంలో కురిసిన అకాల వర్షానికి వడగండ్ల వానతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. ఉద్యాన పంటలు భారీగా దెబ్బతిన్నాయని, కోట్ల రూపాయలు రైతులు పెట్టుబడి పెట్టి నష్టపోయారని తెలిపారు. అనంతపురం, నార్పల, పుట్లూరు, కూడేరు, ఉరవకొండ, గార్లదిన్నె, సింగనమల, గుత్తి, గుంతకల్లు, యల్లనూరు, రాప్తాడు, రాయదుర్గం, బొమ్మనహాల్, కళ్యాణదుర్గం మండలాలలో సుమారు 447393 హెక్టార్లలో రూ.211.91 కోట్లకు పైగా విలువైన చీని, మిరప, అరటి, మామిడి, మొక్కజొన్న, టమోటా, కలింగర, కర్బూజ, వేరుశనగ తదితర పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన అధికారులు ప్రాథమిక నివేదిక అంచనా వేశారని తెలిపారు. కానీ క్షేత్రస్థాయిలో అధికారులు పంట నష్టం అంచనా వేయడంలో ప్రభుత్వం నిబంధనలు ఆధారంగా మాత్రమే అంచనాలు వేస్తున్నామని చెప్పడంతో పంట నష్ట పరిహారం అందుతుందో లేదో అని రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. ఈదురు గాలులు వర్షాలతో మామిడి, నిమ్మ, చీని, సపోటా, దానిమ్మ కాయలు రాలి మిరప, కోత కోసిన తర్వాత ఆరబెట్టిన సమయంలో వర్షం రావడంతో మిరప పంట మొత్తం తడిసి పాడైపోయిందన్నారు. కానీ నిబంధనలు ప్రకారం రాలి పోయిన పంటకు, తడిసిన మిరపకు పరిహారం నిబంధనలు ప్రకారం రాదని అధికారులు చెబుతున్నడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పంట నష్టం జరిగినా జిల్లా ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా రైతులకు భరోసా కల్పించకుండా చూసీచూడనట్లు వ్వవహారించడం రైతులకు తీవ్ర నష్టం కలగజేస్తుందన్నారు. ప్రభుత్వం పంటనష్టపరిహారం నిబంధనలు సవరించి ఎకరాకు రూ.లక్ష పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

.నగర మేయర్ మొహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

వేసవి దృష్ట్యా నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా దృష్టి సారించాలని నగర మేయర్ మొహమ్మద్ వసీం అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని 39వ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో మేయర్ వసీం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తమకు నీరు సరిగా సరఫరా కావడంలేదని మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మేయర్ సమస్యను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాత పైప్‌లైన్ సరిగా లేకపోవడం వల్ల నీటి సమస్య తలెత్తుతోందని అధికారులు మేయర్‌కు వివరించారు. కొత్తగా వేసిన పైప్‌లైన్ ద్వారా వెంటనే నీటి సరఫరా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా నీటి సమస్య లేకుండా చూడాలని, ఏవైనా చిన్న సమస్యలు ఉంటే వాటిని కూడా వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. మేయర్ వెంట కార్పొరేటర్ ఇషాక్, వైసీపీ నాయకులు మధు, ఖాజా, మధు, డీఈ లు నరసింహులు, రాంప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్ : రంజాన్ మాసం ప్రారంభం, శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని మసీదులు, రామాలయాల వద్ద సౌకర్యాలను కల్పించాలని నగర మేయర్ మహమ్మద్ వసీం అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసం ప్రారంభం, శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని మసీదులు, రామాలయాల వద్ద సౌకర్యాల కల్పనపై మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్ రెడ్డి, ఇన్‌ఛార్జి కమిషనర్ రమణారెడ్డిలతో కలిసి అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రారంభం అయిన నేపథ్యంలో మసీదుల వద్ద పారిశుధ్యం మెరుగుతో పాటు నీటి సౌకర్యం, లైటింగ్ చేపట్టాలని సూచించారు. తెల్లవారుజామున విద్యుత్ కోతలు లేకుండా చూడాలని, ప్రస్తుతం ఇళ్లకు అందిస్తున్న నీటి సరఫరాకు అదనంగా మరో గంట పాటు నగరమంతా నీటి సరఫరా పెంచాలని సూచించారు. శ్రీరామనవమి పండుగ రోజు నగరంలోని అన్ని శ్రీరామ ఆలయాల వద్ద పారిశుధ్యం మెరుగుపరచడంతో పాటు లైటింగ్ సౌకర్యం పెంచాలని సూచించారు. ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కిందిస్థాయి సిబ్బందిపై వదిలేయకుండా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. సమావేశంలో పలువురు కార్పొరేటర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను తెలుసుకుంటున్న మేయర్ వసీం

ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగుండాలి

రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహ్మద్

ప్రజాశక్తి-గుత్తి

ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహ్మద్ పేర్కొన్నారు. పట్టణంలోని గుత్తి-అనంతపురం రోడ్డు పక్కన ఉన్న మదరసాలో సఫా బైతుల్ మాల్ గుత్తి శాఖ బాధ్యులు మౌలానా ముహమ్మద్ అబ్దుల్ హక్ ఆధ్వర్యంలో ముస్లిముల పవిత్ర మాసం రంజాన్‌లో ఉపవాసం ఉండే పేద ముస్లిములకు చెందిన 183 కుటుంబాలకు..ఒక్కో కుటుంబానికి దాదాపు రూ.2,500 విలువజేసే రేషన్ సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఉర్దూ అకాడమీ రాష్ట్ర అధ్యక్షులు నదీమ్ అహ్మద్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పదేళ్లుగా సఫా బైతుల్ మాల్ కమిటీ ఆధ్వర్యంలో పేద ముస్లిములకు రంజాన్ నెలలో నిత్యావసర వస్తువులు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్, మాజీ సర్పంచి డి.హుస్సేన్ పీరా, వక్ఫ్ బోర్డు జిల్లా ఛైర్మన్ రిజ్వాన్ సాహెబ్, వైస్ ఛైర్మన్ అహ్మద్ బాషా, వక్ఫ్ బోర్డు సభ్యులు ఫయాజ్ బాషా, మౌల్వీ రిజ్వాన్, మౌల్వీ జుబేర్, హాఫిజ్ కరీమ్, అన్వర్, జిలాన్ బాషా, షేక్షావలి, ఉలేమాలు, హాఫిజ్లు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

సచివాలయం తనిఖీ

పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి సచివాలయాన్ని ఎంపీడీవో యోగానంద రెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మూమెంట్ రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. తంబ్ వేశారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకోవాలన్నారు. వివరాలను సెల్‌లో అప్డేట్ చేస్తూ పై అధికారులకు పంపాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. ఏమన్నా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల పర్యటనకు ఏర్పాట్లు

అనంతపురం సిటీ : రాయదుర్గానికి ఈనెల 25వ తేదీ వస్తున్న హైకోర్టు జడ్జిల పర్యటనకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం ఆదేశించారు. గురువారం అనంతపురంలోని కెఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గుత్తి డివైఈవో శంకరప్రసాద్, పలువురు ఎంఇఒలతో ఆయన సమావేశం నిర్వహించారు. పర్యటనకు సంబంధించి షెడ్యూల్ ప్రకారంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం ఎంఇఒ నాగలక్ష్మి, కళ్యాణదుర్గం ఎంఇఒ విజయ కుమారి, హెచ్ఎం లు తదితరులు పాల్గొన్నారు.

పంటనష్టం పరిశీలన

నార్పల : అకాల వర్షాలకు మండల పరిధిలోని కేశేపల్లి, నడిమిదొడ్డి, వెంకటాంపల్లి గ్రామాల్లో జరిగిన పంట నష్టాన్ని తహశీల్దారు నారాయణస్వామి, వ్యవసాయ అధికారి ముస్తఫా గురువారం పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారుల బృందాన్ని ఏర్పాటు చేశారు. వారు చేస్తున్న పంట నష్టం అంచనా పనితీరును తహశీల్దారు, ఎఒ పరిశీలించారు. రెండు రోజుల్లో నష్టాన్ని అంచనావేసి నివేదికను ఇవ్వాలని ఆదేశించారు.

కోటకొండలో ఉత్సవాలు

పెద్దవడుగూరు : మండలంలోని కోటకొండలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుణాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 32 అడుగుల ఎత్తులో ఉన్న ఆంజనేయుడిని అర్చకులు కోదండపాణి పూలతో అలంకరించి భక్తులకు దర్శనం ఇచ్చేలా చేశారు. దీంతో పలువురు పుష్పాభిషేకాలు, ఆకుపూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పన్నారపు బండ్లతో వచ్చి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

వెంకటరమణ స్వామి కల్యాణోత్సవం

యాడికి : కమలపాడు పంచాయతీలో లక్ష్మీ కొత్త వెంకటరమణ స్వామి కల్యాణోత్సవాన్ని గంగవరం చంద్రయ్య శెట్టి, శ్రీధర్, ప్రసాదు, రాజేంద్ర ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కల్యాణం అనంతరం సామివారి పల్లకి సేవ చేపట్టారు. రవ్వ ఫ్యామిలీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అల్పాహారం భోజన ఏర్పాట్లు చేశారు. పెన్నా సిమెంట్ వారి ఆధ్వర్యంలో చలివేంద్రం, వైద్య శిబిరం, సెక్యూరిటీ కార్యక్రమాలు నిర్వహించారు. వాగ్దేవి స్కూల్ విజన్ స్కూల్ ఆధ్వర్యంలో యాడికి నుండి చింత్రాయపల్లి కొత్త రాయుడు స్వామికి ఉచిత వాహన సౌకర్యం ఏర్పాటు చేశారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం

పెద్దవడుగూరు : మండలంలోని క్రిష్టిపాడులో చైడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవం గురువారం వైభవంగా ముగిసింది. ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బుధవారం రాత్రి భక్తులు గ్రామ పురవీధుల గుండా చౌడేశ్వరి జ్యోతులను ఊరేగిస్తూ భక్తిశ్రద్ధలతో గీతాలను ఆలపించారు. రెండురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను గ్రామంలోని ప్రజలు ఎంతో వైభవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆలయం ముందు చెక్కభజన గేయాలు ఆలపించి ఆకట్టుకున్నారు. పెద్దవడుగూరులో కూడా జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా క్రిష్టిపాడులో ఎస్ఐ రాజశేఖరరెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని రామకోటి గ్రామంలో జ్యోతుల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరి జ్యోతులను గురువారం తెల్లవారుజామున తల పైన ఎత్తుకొని భక్తి పాటలు, మంగళవాయిద్యాల నడుమ నృత్యం చేశారు. చౌడేశ్వరి అమ్మవారి జ్యోతులు చూసేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు

సమీక్ష సమావేశం

పుట్లూరు : అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న ఉద్యాన పంటలను గుర్తించాలని సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో యోగానందరెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలతో నష్టపోయిన రైతుల వివరాలను తప్పనిసరిగా విస్తీర్ణంతో సహా గుర్తించాలన్నారు. ఏ రైతు ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో ఏయే పంటలు వేశారు.. ఎంత నష్టం వాటిల్లిందో పంట పొలాలకు వెళ్లి నష్టాన్ని అంచనా వేయాలని విఆర్ఒ, అగ్రికల్చర్ అధికారులకు సూచించారు. అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపీడీవో హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ అశ్రఫ్ అలీ

ప్రజాశక్తి-ఉరవకొండ

పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఆశ్రఫ్ అలీ, త్రిపుల్ ఈ శాఖధిపతి వై.సురేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం ఉరవకొండ మండలం చిన్న ముష్టూరు గ్రామంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి సహజ అవాసాలపై వాతావరణ మార్పులు చూపే ప్రభావం గురించి ప్రజలకు అవగాహన కలిగించడం కోసం ఈ దినోత్సవం జరుపుకుంటారన్నారు. సమాజపు భద్రత, శ్రేయస్సు కోసం జాతీయ వాతావరణ, జల సేవలు అందించే సహకారం గురించి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులకు సంబంధించి అధ్యయనం చేసేందుకు 1950, మార్చి 23న 180 దేశాల సభ్యత్వంతో ప్రపంచ వాతావరణ సంస్థ ప్రారంభించింది. ఆ సంస్థ ఏర్పడిన రోజును ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తారని తెలిపారు. వాతావరణ శాఖ నిపుణుల ఆధ్వర్యంలో ప్రజల కోసం అవగాహన సమావేశాలు, ఛాయాచిత్ర ప్రదర్శనలు జరుగుతాయన్నారు. వాతావరణ పరిశోధన చేసిన వాళ్లకు

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ణ అశ్రఫ్ అలీ

ఈ దినోత్సవం సందర్భంగా అంతర్జాతీయ వాతావరణ సంస్థ బహుమతి, ప్రొఫెసర్ డాక్టర్ విల్హోవైసెల్ అవార్డు, ది నార్బర్ట్ గెర్బియర్ మమ్ అంతార్జాతీయ అవార్డులు అందజేస్తారన్నారు. ప్రపంచ దేశాలన్నింటిలో కూడా అవగాహన సదస్సులు నిర్వహించుకుంటారని తెలిపారు.

విప్లవవీరుడు భగత్‌సింగ్‌కు ఘన నివాళి

గుత్తిలో భగత్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గుత్తి

విప్లవ వీరుడు భగత్ సింగ్ 93వ వర్ధంతిని ఎస్ఎఫ్ఐ, జేవీవీ, భగత్‌సింగ్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో గుత్తిలో గురువారం నిర్వహించారు. స్థానిక ఏపీ బాలికల గురుకుల పాఠశాల సమీపంలో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ భగత్‌సింగ్, భగత్ సింగ్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు శ్రీధర్ గౌడ్, భగత్‌సింగ్ యూత్ కమిటీ సభ్యుడు నిజామొద్దీన్ మాట్లాడుతూ దేశ భక్తి భావం పెంపొందించేందుకు యువతకు భగత్‌సింగ్ ఆదర్శం అన్నారు. అంతరాలు, అసమానతలు లేని సమాజం నిర్మించడమే భగత్‌సింగ్ ఆశయం అన్నారు. భగత్ సింగ్ భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాడి బ్రిటిష్ వారి చేతుల్లో ఉరి తీయబడ్డరని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. రాయదుర్గం డివిజన్ అధ్యక్షులు కుమార్ నాయక్ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ జయంతి, వర్ధంతిలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, భగత్‌సింగ్ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు అట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి లీమా రోజ్, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి అనిల్‌కుమార్, చందు, నిఖిల్, వీరేష్ విద్యార్థినులు పాల్గొన్నారు.

దేవాలయ భూమికి ఎసరు..!

బుక్కరాయసముద్రం : అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న బుక్కరాయసముద్రం శ్రీ కొండమీదరాయుడు దేవాలయానికి చెందిన దేవరకొండకు చెందిన భూమికి అధికార పార్టీ నాయకులు ఎసరు పెడుతున్నారు. బుక్కరాయసముద్రం గ్రామ సర్వే నంబర్ 396-5 ఖాతా నెంబర్ 3208 లో 1.61 ఎకరాల భూమిని ఒక వ్యక్తి నుంచి అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకులు అసైన్మెంట్ చట్టానికి విరుద్ధంగా కొనుగోలు చేశారు. స్థిరాస్తి వ్యాపారానికి సిద్ధం చేసి రూ.కోట్లు సంపాదించాలన్న తాపత్రయంతో పవిత్రమైన దేవరకొండకు చెందిన భూమిని మింగేశారు. అసైన్మెంట్ చట్టం 9/77, సవరణ చట్టం 8/2007కు విరుద్ధంగా అన్యాక్రాంతం చేయడమే కాకుండా స్థిరాస్తి వ్యాపారం చేయడానికి సిద్ధమయ్యారు. కొన్నది 1.61 ఎకరాలైతే ప్లాట్లుగా వేసింది 115. ఇందులో 8 రోడ్లకు గాను మరో 58 సెంట్లు మొత్తం 2.36 సెంట్లకు లేఅవుట్‌ను సిద్ధం చేశారు. రెవెన్యూ అధికారులు ప్రజల ఒత్తిడి మేరకు తూతూ మంత్రంగా నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోకుండా ఉండడం అనేక అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

25న న్యాయ విజ్ఞాన సదస్సు

రాయదుర్గం : రాయదుర్గం మండలం 74- ఉడేగోళం మద్దానేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న కళ్యాణమండపంలో మహిళా సాధికారతపై న్యాయ విజ్ఞాన సదస్సును ఈనెల 25వ తేదీ శనివారం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ మారుతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సదస్సులో అనంతపురం, సత్యసాయి జిల్లాల కలెక్టర్లు నాగలక్ష్మి, బసంత్ కుమార్, ఎస్పీలు డాక్టర్ పకీరప్ప, రాహుల్‌దేవ్ సింగ్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.శ్యాంసుందర్, డి.రమేష్, ఎవి.శేషసాయి, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి భబిత, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఎ.రామిరెడ్డి, రాయదుర్గం బార్ అసోసియేషన్ అధ్యక్షులు లోకానంద తదితరులు పాల్గొంటారని తెలిపారు.

హైకోర్టు ఆదేశాలు బేఖాతర్

దేవుని మాన్యం భూముల్లో అక్రమంగా సేద్యం

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని జక్కలచెరువు గ్రామంలో ఉన్న గొందిపల్లి ఆంజనేయ స్వామి మాన్యం భూముల్లో వివాదం తలెత్తింది. జక్కలచెరువు గ్రామ పంచాయతీలోని గొందిపల్లి ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించి మాన్యం భూములు గొందిపల్లి గ్రామ శివారులో ఉన్నాయి. 1810 సంవత్సరం నుంచి భూములను అర్చకులు సాగు చేసుకుంటూ జక్కలచెరువు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ధూప, దీప నైవేద్యాలు చేస్తున్నారు. అయితే బుధవారం గొందిపల్లి గ్రామానికి చెందిన కొందరు ఆ భూములు గొందిపల్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయానికి సంబంధించినవని దౌర్జన్యంగా సేద్యం పనులు చేశారు. మాన్యం భూముల విషయంపై అర్చకులు హైకోర్టులో పిటీషన్ వేశారు. భూముల విషయం విచారించాలని హైకోర్టు దేవాదాయ శాఖను ఆదేశించింది. అయితే దేవాదాయ శాఖ నుంచి నివేదిక రాకముందే గొందిపల్లి వాసులు మాన్యం భూముల్లో దౌర్జన్యంగా ప్రవేశించి సేద్యం పనులు చేశారని అర్చకుడు రవికుమార్ ఆరోపించారు. గొందిపల్లి గ్రామస్తులు తమ భూముల్లో దౌర్జన్యంగా ప్రవేశించడంపై

మన్యం భూముల్లో దౌర్జన్యంగా సేద్యం పనులు చేస్తున్న గ్రామస్తులు

అర్చకుడు రవికుమార్ సిఐ ఎం. వెంకటరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. అప్పటి మద్రాసు ప్రభుత్వం ఆలయం జక్కలచెరువులో ఉందని రిజిష్టర్ 25లో పొందుపరిచిందని అర్చకుడు రవికుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

జీడిపల్లి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

సిఎం జగన్‌తో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ నియోజకవర్గం బెలుగుప్ప మండలం జీడిపల్లి గ్రామంలో నిర్వాసితుల పరిహారపు చెల్లింపుల్లోనూ, పునరావాసం కల్పించడంలోనూ ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి వారికి న్యాయం చేయాలని ఎమ్మెల్సీ శివరామ రెడ్డి ముఖ్యమంత్రిని కోరారు. గురువారం ఆయన సిఎం కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ఉరవకొండ నియోజకవర్గం లోని కొన్ని సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లారు. బెలుగుప్ప మండలం జీడిపల్లి గ్రామంలో రైతులు తమ భూములను, ఇళ్లను జీడిపల్లి రిజర్వాయర్ కోసం త్యాగం చేశారన్నారు. వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజి కింద చెల్లించాల్సిన పరిహారం ఇవ్వలేదని, పునరావాసం కల్పించలేదన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి సంబంధిత కార్యదర్శులకు సదరు సమస్యను పరిష్కరించి నివేదికలను తనకు సమర్పించాలని ఆదేశించారు. పరిహార చెల్లింపు విషయంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డితో సంప్రదింపులు జరుపుతూ ముందుకెళ్లాలని సూచించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పోస్టులు మంజూరు చేయాలి

ఉరవకొండ బాలికల జూనియర్ కళాశాల, ముదిగుబ్బ, గుడిబండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు అధ్యాపక పోస్టులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. దీనిపై తాను గతంలో కూడా లేఖ రాశానన్నారు. వెంటనే అధ్యాపక పోస్టులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన సిఎం స్పందించిన సిఎం ఆ ఫైలును తన వద్దకు పంపాలని ఆయా శాఖల కార్యదర్శులను ఆదేశించారు. పోస్టులు మంజూరుకై తగిన ఉత్తర్వులు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని శివరామిరెడ్డికి హామీ ఇచ్చారు.

గూగూడు, బండ్లపల్లి గ్రామాలను సందర్శించిన స్వచ్ఛభారత్ బృందం

ప్రజాశక్తి-నార్పల

నార్పల మండలంలోని గూగూడు, బండ్లపల్లి ఆదర్శ గ్రామాలను స్వచ్ఛభారత్ అధికార బృందం గురువారం సందర్శించింది. ఈ గ్రామాల్లో అమలవుతున్న స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలను పరిశీలించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం ఏ విధంగా ఉంది, ప్రజలకు వీటిపై అవగాహన ఎంత ఉందో లబ్ధిదారులతో మాట్లాడి తెలుసుకున్నారు. బహిరంగ మలమూత్ర విసర్జన వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని, వ్యక్తిగత మరుగుదొడ్లను వాడాలని తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ హై స్కూళ్లలో విద్యార్థులు చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, తాగునీటి వసతి ఏ విధంగా ఉంది, మరుగుదొడ్ల నిర్మాణం, వాటి పరిరక్షణను పరిశీలించారు. వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. అనంతరం వారు ఘన వ్యర్థపదార్థాల సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. సేకరించిన చెత్తను ఏ విధంగా ఉపయోగిస్తున్నారు, వర్మీకంపోస్టు తయారీ విధానం, చెత్త నుండి సంపద తయారీ కోసం చేపట్టిన చర్యల గురించి ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులు షర్మిల, సునీత ఈవోఆర్డీ లక్ష్మీనరసింహ, పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ, హెడ్మాస్టర్లు గురుప్రసాద్, చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, మధు,

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

కుళ్లాయప్ప, ఉపేంద్ర, హరి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్యాకేజీ కింద పరిహారం ఇవ్వండి

మాజీ పిసిసి అధ్యక్షుడు శైలజానాథ్

పుట్లూరు : అకాల వర్షానికి దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే ఇన్సూరెన్స్ కాకుండా ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని మాజీ పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. గురువారం పుట్లూరు మండల రైతులతో కలిసి ఆయన జిల్లా ఉన్నతాధికారులను కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన అధికారి రఘునాథరెడ్డి, డ్రిప్, ఇరిగేషన్ పీడీ పిరోజ్‌ఖాన్‌ను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ వడగండ్ల వానకి గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు పంటలు నష్టపోయారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఇన్సూరెన్స్ కాకుండా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. అరటి, దానిమ్మ, బొప్పాయి, చీనీ, మొక్కజొన్న, టమోటా తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వీటికి స్పందించిన అధికారులు ఇన్సూరెన్స్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. శైలజానాథ్ వెంట డిసిసి అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, పూల ప్రసాద్, కడవకల్లు, ఓబుళాపురం, దోసలేడు గ్రామాల రైతులు ఉన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-శింగనమల

చిరుధాన్యాలను తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని అంగన్వాడీ కార్యకర్త టి.రత్నమ్మ తెలిపారు. గురువారం శింగనమల మండల పరిధిలోని శోధనపల్లి గ్రామంలోని అంగనవాడీ కేంద్రంలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త రత్నమ్మ మాట్లాడుతూ చిరుధాన్యాలు తినడం వల్ల షుగర్, బీపీ వంటి రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీ చేస్తున్న జొన్న పిండి, రాగి పిండి, బెల్లం, వేరుశనగ చిక్కిలు, బియ్యపు అటుకులు, పాలు, గుడ్లు, మునగాకు తీసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పిల్లలు ఎత్తు, బరువు పెరుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త బి.సరస్వతి, ఆయా రామాంజనమ్మ, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ పిల్లలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-ఆత్మకూరు

పి.యాలేరు గ్రామానికి చెందిన గొల్ల తిమ్మరాజును పొలం వద్ద అదే గ్రామానికి చెందిన గుర్తుతెలియని వ్యక్తులు చంపడానికి ప్రయత్నించారని ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 15వ తేదీన ఫిర్యాదు చేసిన విషయం విధితమే. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం ఆత్మకూరు గ్రామం హైవేపై ఎస్ఎస్ఎస్ డాబా వద్ద ఉన్న ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. 6వ నిందితుడు శేఖర్ పరారీలో ఉన్నాడు. యాలేరు గ్రామానికి చెందిన బోయ ఎడమల గణేష్ (38), కూడేరు మండలానికి చెందిన అక్కులన్న (36), కూడేరు మండలం పి.నారాయణపురం గ్రామానికి చెందిన నేసే వెంకట రాముడు (24), అనంతపురం తపోవనంకు చెందిన చాకలి మధుసూదన్ (34), అనంతపురం రూరల్ మండలం కృష్ణంరెడ్డిపల్లికి చెందిన వడ్డే చిరంజీవి (23)ను పోలీసులు అరెస్టు చేశారు. బొలెరో వాహనం, దాడి చేయడానికి ఉపయోగించిన కట్టెలు, రాళ్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రూరల్ మండలం కురుగుంట గ్రామానికి చెందిన వడ్డే శేఖర్ పరారీలో ఉన్నాడు.

ఆరుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని బాలాపురం గ్రామంలో జూదం ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. జూదం ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.46,400 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని బెలుగుప్ప తండాకు వెళ్లే దారి సమీపంలో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ రామకృష్ణయ్య తన సిబ్బందితో గురువారం దాడులు నిర్వహించారు. కొందరు నిందితులను అదుపులోకి తీసుకొని నాలుగు బైక్ లను, రూ.18,710 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి నిందితులను రిమాండుకు తరలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం : రాయదుర్గం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు అర్హులైన వారు ఈనెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ ప్రభావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గుమ్మఘట్ట మండలం కోనాపురం గ్రామంలో అంగన్వాడీ కార్యకర్త పోస్ట్ ఒకటి, డి.హీరేహాళ్, ఎస్ఆర్ కోట, మురడి, మారంపల్లి తండా, కోనాపురం, జుంజురంపల్లి, పూలకుంట గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తుతో పాటు సంబంధిత అర్హత పత్రాల గెజిటెడ్ అధికారి చే ధ్రువీకరణ చేయించి ఈనెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు రాయదుర్గం ఐసిడిఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కణేకల్లు : కణేకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహానిస్తున్నట్లు సిడిపిఒ ఎల్లమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మసముద్రం ఒకటో సెంటర్‌లో 1 (ఎస్‌సి), దేవగిరిలో 2 (బిసి-బి), బొమ్మనహాళ్‌లో 3 (ఒసి) సింగేపల్లిలో 1 (బిసి-బి) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. నోటిఫికేషన్ వెలువడిన రోజు నుండి ఏడు రోజులలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో అప్లికేషన్ తీసుకొని దానిని అదే కార్యాలయంలో ఇచ్చి రసీదు పొందాలన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పుట్లూరు : మండలంలో మూడు అంగన్వాడీ ఆయా మినీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజమణి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. చాలవేముల 2 (ఒహెచ్), నాగిరెడ్డిపల్లి 3 (ఒసి), ఎలుట్ల -1 (ఎస్‌సి) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 10వ తరగతి పాసైన వారు ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తాడిపత్రి ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

నేడు వినాయక ఉత్సవ సమితి సమావేశం

రాయదుర్గం : రాయదుర్గంలోని వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం పట్టణ వినాయక ఉత్సవ సమితి సమావేశం నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షులు గౌని ప్రతాపరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయదుర్గంలో వినాయక ఉత్సవ సమితి ఏర్పడి మూడో సంవత్సరంలో అడుగుపెడుతున్నదని తెలిపారు. ఈ వినాయక ఉత్సవాలను రాయదుర్గంలో కూడా ఘనంగా, వైభవంగా జరుపుకోవాలని స్థానిక మండపాల యువకులు పెద్దలు పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు. అందుకు ఈసారి వచ్చే వినాయక చవితికి రాయదుర్గంలో హిందూ మహా గణపతి ఉత్సవాలను వైభవంగా జరుపుకోవాలని, దానికి అన్ని రకాల సన్నద్ధత చేయాలని ఇప్పటినుండే వినాయక ఉత్సవ సమితిలి ఆధ్వర్యంలో ప్రయత్నాలు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం 24వ తేదీ ఉదయం 10 గంటలకు వేణు గోపాలస్వామి దేవస్థానంలో వినాయక మండపాల కమిటీలతో విస్తృత సమావేశం ఏర్పాటు చేశామన్నారు. రాయదుర్గంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తున్న స్థానిక వినాయక మండపాల కమిటీ సభ్యులు, కార్యకర్తలు అందరూ ఈ సమావేశంలో పాల్గొనాలని వినాయక ఉత్సవ సమితి అధ్యక్షుడు గౌని ప్రతాపరెడ్డి కోరారు.

స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘం పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళలకు స్వచ్ఛత అవార్డులు ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాయదుర్గం పురపాలక సంఘం కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధికరణ, చెత్త సేకరణ, మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించే పద్ధతులు, చెత్తతో కళాకృతుల తయారీ, చెత్తతో సంపద తయారీ, పొడి చెత్తను వినూత్న రీతిలో వినియోగించడం, స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, తడి చెత్త వినియోగంతో కంపోస్టు తయారీ మొదలగు విభాగాలలో అవార్డులు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈనెల 24వ తేదీలోగా రాయదుర్గం పురపాలక కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవార్డులను అందజేస్తామని వెల్లడించారు.

శ్రీముడి అర్పించిన నారసింహ భక్తులు

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం నుండి నరసింహస్వామి మాలదారులు పాదయాత్రగా మల్లాపురం విప్రమలై నరసింహస్వామి ఆలయానికి చేరుకొని శ్రీముడిని స్వామి వారికి గురువారం సమర్పించారు. ఈ ఏడాది 29 మంది నరసింహ మాలను ధరించి 48 రోజులపాటు దీక్ష చేపట్టారు. నరసింహస్వామి బ్రహ్మోత్సవాల అనంతరం మాఘ పౌర్ణమి రోజు మాలాధారణ ధరించడం ఆనవాయితీ. 49వ రోజు ఉగాది పండుగ మరుసటి రోజున (పాడ్యమి) మాలధారణతో శ్రీ ముడిని స్వామివారికి అర్పించి దీక్ష విరమింపజేస్తారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు శ్రీరామ్మూర్తి స్వామీజీ, వేద పండితులు హరిప్రసాద్, భరద్వాజ్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం రాయదుర్గం పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి దేవాలయంలో శ్రీ స్వామివారికి పుష్పాలంకరణ, నైవేద్య పూజలు, మహా మంగళహారతి నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు ధర్మన్న, కోశాధికారులు సత్యనారాయణ, నరసింహులు, కార్యదర్శి గురు రాఘవేంద్ర ప్రసాద్, అకౌంటెంట్ వెంకటేశులు, కార్యవర్గ సభ్యులు గురునాథరెడ్డి, రామిరెడ్డి, వెంకటరెడ్డి, కమలాక్షుడు, తిమ్మారెడ్డి, తిప్పేస్వామి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్కమ్మ ఉత్సవాలు

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గంలో అక్కమ్మగార్ల తిరునాళ్లు గత రెండురోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా ఉగాది మరుసటి రోజున నిర్వహించే అక్కమ్మ జాతర గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం ఉదయం నుండే తిరునాళ్లు మొదలయ్యాయి. దుర్గం ప్రాంతంలోనే కాక కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుండి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుండి భక్తులు బోనాలతో అక్కమ్మను పూజించేందుకు ఉదయం నుండి బారులు తీరారు. పూజల అనంతరం పానకాలను సమర్పించారు. తిరునాళ్ల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.